




# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190



నేటి దిక్సూచి
తెలుగు దినపత్రిక
రిపోర్టర్స్ కావలెను
నూతనంగా వెలువడుతున్న నేటి దిక్సూచి తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో క్రింద తెలుపబడిన కాటగిరిలలో విలేకరులు కావలెను.
- జిల్లా బ్యూరో లు
- జిల్లా ఇంచార్జి లు
- నియోజకవర్గ రిపోర్టర్లు
- మండల రిపోర్టర్లు

ఆసక్తి గలవారు క్రింది నంబరును సంప్రదించండి
Call : 9100900931



ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :155 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ గురువారం- 01 - అక్టోబర్ - 2026


## సహ పైలట్‌తో పోరాడి.. 180 మంది ప్రాణాలు కాపాడిన భారతీయ పైలట్




- సహ పైలట్ దాడి చేసినా.. ప్రాణాలకు తెగించి మరీ ఆయన 180 మంది ప్రాణాలు కాపాడారు.
- ఓవైపు దాడిని ఎదుర్కొంటూనే.. మరోవైపు విమానం కూలిపోకుండా నియంత్రించారు.

ఇంటర్నెట్ డెస్క్: దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఉగ్రవాద ప్రయత్నాన్ని అదే విమానానికి కెప్టెన్‌గా ఉన్న ఓ భారతీయుడు అడ్డుకున్నారు.

## పునరుత్పాదక ఇంధన రంగానికి ఊతం..
# రూ.1,86,405 కోట్ల నిధులు

- దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.
- ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ 'పీఎమ్ ధార'పథకానికి ఆమోదం తెలిపింది.



ఢిల్లీ, సెప్టెంబర్ 30: దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఇవాళ ఢిల్లీలో సమావేశమైన కేంద్ర క్యాబినెట్ 'పీఎమ్ ధార'పథకానికి ఆమోదం తెలిపింది. ఈ భారీ ప్రాజెక్టు కోసం రూ.1,86,405 కోట్ల నిధులు కేటాయించారు. సోలార్ లేదా విండ్ ప్లాంట్లు సాధారణంగా నగరాలకు దూరంగా (ఎడారులు లేదా మైదాన ప్రాంతాల్లో) ఉంటాయి. అక్కడ తయారైన కరెంట్‌ని అక్కడే ఉంచలేం. దాన్ని మన ఇళ్లకు, పరిశ్రమలకు చేర్చాలంటే భారీ ట్రాన్స్‌మిషన్ లైన్లు (విద్యుత్ తీగలు), సబ్-స్టేషన్లు, గ్రిడ్ వ్యవస్థ కావాలి. అక్కడ ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌లోకి సురక్షితంగా తరలించడాన్ని మిగతా..2లో

## అక్టోబర్2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' యాత్ర
# ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసిన ఇండీ కూటమి




- అక్టోబర్ 6న ఈసీ కార్యాలయం వరకు విపక్ష ఎంపీల ప్రదర్శన
- విపక్ష ఎంపీలు ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపిన మల్లికార్జున ఖర్గే

ఢిల్లి : ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసిన కూటమి ఓటరు జాబితా సవరణ లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీగా చేపట్టనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలంతా రాష్ట్రపతిని కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పించనున్నారు. దేశవ్యాప్తంగా 5 భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. వాటి తేదీలు, ప్రదేశాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో నోట్ బందీ చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు 'ఓట్ బందీ' ద్వారా ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రధాని, హోంమంత్రి మిగతా..2లో

## కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ...



- జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి
- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలని పిలుపు
- సీఎం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ
- నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య
- గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం

హైదరాబాద్: వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ

## మంచిపేరొచ్చినా.. చెడ్డ పేరొచ్చినా
# ఉద్యోగుల వల్లే
### సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



- ప్రభుత్వానికి మంచి పేరొచ్చినా, చెడ్డ పేరొచ్చినా అది పూర్తిగా ఉద్యోగుల పనితీరు వల్లే ఉంటుందని సీఎం స్పష్టం
- కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన కలెక్టర్ భవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు.
- ప్రభుత్వ ఉద్యోగులే కీలక ప్రతినిధులని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.
- రాష్ట్రంలో 10.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 4 కోట్ల మంది ప్రజలకు సేవలు అందిస్తున్నారని

హైదరాబాద్: పేదల సమస్యల పరిష్కార వేదికలుగా కలెక్టరేట్ కార్యాలయాలు సక్రమంగా ఉపయోగపడాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన కలెక్టర్ భవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు. అనంతరం అక్కడే కలెక్టరేట్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రభుత్వ పాలన, ఉద్యోగుల బాధ్యతలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై సీఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

### ఉద్యోగులే ప్రభుత్వ ప్రతినిధులు..

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వ ఉద్యోగులే కీలక ప్రతినిధులని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు లేదా మిగతా..2లో

## గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం'..
## వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష



- వీబీ జీ రామ్ జీపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
- గామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్ష చేపట్టారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 30: వీబీ జీ రామ్ జీపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్ష చేపట్టారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి క్షేత్రస్థాయి సమస్యలపై మంత్రి ఆరా తీశారు. అమలులో గ్రామ పంచాయతీల పాత్ర, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు.

## క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు.. ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు



- 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్న మంత్రి లోకేశ్
- యువత మార్పు కోరుకుంటోందన్న మంత్రి
- డీఎస్సీపై ఆరోపణలను కొట్టివేసిన లోకేశ్
- అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు ప్రస్తావన
- పెట్టుబడులకు 3ఎస్ విధానం అనుసరిస్తున్నామని వివరణ

అమరావతి: యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. మిగతా..2లో

## ఆసియా క్రీడల్లో స్వర్ణం.. చికిత, సాహిల్‌కు సీఎం రేవంత్ అభినందనలు



- ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన చికిత, సాహిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.
- అసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి చికిత స్వర్ణ పతకాన్ని సాధించింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 30: ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన చికిత, సాహిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి చికిత స్వర్ణ పతకాన్ని సాధించింది. మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీలో చికిత-సాహిల్ జోడీకి గోల్డ్ వరించింది. దీంతో ఒకేరోజు రెండు స్వర్ణాలు సాధించిన చికిత.. 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలో ఆసియా క్రీడల్లో సర్ణం సాధించిన పెద్దపల్లికి మిగతా..2లో

## కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చంద్రకళ పతకం గెలవడం అభినందనీయం



- కామన్వెల్త్ పోటీల్లో సత్తా చాటిన ఎక్సైజ్ కానిస్టేబుల్ చంద్రకళ
- చంద్రకళను అభినందించిన ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- పథకాలు సాధించే క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యాఖ్య

అమరావతి: అంతర్జాతీయ క్రీడా వేదికలపై ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు తమ సత్తా చాటారు. కెనడాలో జరిగిన కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన రాష్ట్ర ఎక్సైజ్ కానిస్టేబుల్ చంద్రకళను గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం సత్కరించారు.

## పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి..
# 60 వేల మందికి పట్టాలు ఇచ్చాం

- 'నేడు ఇంతమంది ముఖాల్లో నవ్వులు చూస్తున్నా.
- నా జీవితంలో ఈరోజును తప్పకుండా గుర్తు పెట్టుకుంటా' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.
- విజయవాడలో నిర్వహించిన పేదల పట్టాల పండుగ సభలో సీఎం మాట్లాడారు.



విజయవాడ, సెప్టెంబర్ 30: 'నేడు ఇంతమంది ముఖాల్లో నవ్వులు చూస్తున్నా. నా జీవితంలో ఈరోజును తప్పకుండా గుర్తు పెట్టుకుంటా' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. పేదల పట్టాల పండుగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని తెలిపారు. మిత్రులు పవన్ కల్యాణ్, మోదీతో కలిసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. నేడు అభివృద్ధి, సంక్షేమంలో జెట్ స్పీడుతో ముందుకు సాగుతున్నామన్నారు. విశాఖ, మంగళగిరి, నేడు విజయవాడలో ఇన్ని వేల మందికి పట్టాలు ఇవ్వడం జీవితంలో మరచిపోనని అన్నారు. అరవై వేల మందికి పట్టాలు ఇచ్చామన్నారు. రిజిస్ట్రేషన్ విలువ రూ.19 వేల కోట్లు కాగా.. మిగతా..2లో

## రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా ప్రకటిస్తాం..
# రూ.లక్ష కోట్లతో అభివృద్ధి



- రైజింగ్ రాయలసీమ కోసం రాయలసీమ బిడ్డగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పోరాడుతున్నారని మంత్రి సవిత తెలిపారు.
- రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు సంఘీభావంగా పులివెందులలో టీడీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు.

కడప, సెప్టెంబర్ 30: 'రైజింగ్ రాయలసీమ' కోసం రాయలసీమ బిడ్డగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పోరాడుతున్నారని మంత్రి సవిత తెలిపారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు సంఘీభావంగా పులివెందులలో టీడీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా ప్రకటిస్తాం.. రూ.లక్ష కోట్లతో అభివృద్ధి

అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా సీఎం ప్రకటిస్తారని చెప్పారు. హార్టికల్చర్ హబ్ కోసం లక్ష కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.26 వేల కోట్లు కేటాయిస్తామని వెల్లడించారు. ప్రతి ఎకరాకు నీరు అందించడంతో పాటు వేర్ హౌజ్, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలు చేపడతామని మంత్రి తెలిపారు. పులివెందులకు కూడా వైఎస్ జగన్ సాగు నీరు ఇవ్వలేకపోయారని విమర్శించారు. పులివెందులలో రూ.480 కోట్లతో తాగు నీరు అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పులివెందుల మున్సిపాలిటిలో ప్రజలు టీడీపీని గెలిపించాలని కోరారు. పులివెందుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చంద్రకళ పతకం గెలవడం అభినందనీయం

మరోవైపు, ఏషియన్ గేమ్స్‌లో ఏపీకి చెందిన స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, క్రీడాకారుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఒలింపిక్స్‌లో ఏపీ అథ్లెట్లు పతకాలు సాధించేలా వారికి అన్ని విధాలా మద్దతు అందిస్తున్నామని తెలిపారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ అండగా నిలుస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కామన్వెల్త్ 75 కేజీల విభాగంలో చంద్రకళ రజతం గెలవడం అభినందనీయమని రఆయన కొనియాడారు. ఇదే సమయంలో, జపాన్‌లో జరుగుతున్న ఏషియన్ గేమ్స్ 2026లో భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఫైనల్లో చైనాపై 238-234 స్కోరు తేడాతో విజయం సాధించింది. ఈ జట్టులో ఏపీకి చెందిన వెన్నం జ్యోతి సురేఖ కీలక పాత్ర పోషించారు. ఆమెతో పాటు చికిత తనపర్తి, ప్రతిక ప్రదీప్ సభ్యులుగా ఉన్నారు. జ్యోతి సురేఖకు ఇది ఏషియన్ గేమ్స్‌లో నాలుగో స్వర్ణం కావడం విశేషం. ఈ విజయాలు రాష్ట్రానికి, దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి.

## గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం'.. వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష

అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనానికి పెద్దపీట అని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా మండల, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి, అమలును మరింత పటిష్ఠం చేయాలని మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో 12 వేల మందికిపైగా సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆసియా క్రీడల్లో స్వర్ణం.. చికిత, సాహిల్‌కు సీఎం రేవంత్ అభినందనలు

చెందిన చికిత ప్రతిభపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. చికిత విజయం తెలంగాణ క్రీడా చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. చికిత పట్టుదల క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. ఆసియా క్రీడలు 2026లో కాంపౌండ్ ఆర్చరీలో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో చికిత, సాహిద్ జోడి స్వర్ణపతకాన్ని కైవసం చేసుకుంది. (బుధవారం) జరిగిన ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన పార్క్ జంగ్యాన్, చోయ్ యోంగ్‌హీ జోడీని షూట్‌ఆఫ్‌లో ఓడించి చికిత, సాహిల్ జోడి స్వర్ణం సాధించింది. ఫైనల్‌లో 157-157తో సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు షూట్‌ఆఫ్ నిర్వహించారు. ఈ సమయంలో చికిత, సాహిల్ ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా బుల్స్‌ఐని కొట్టడంతో భారత్ ఖాతాలోకి మరో పసిడి వచ్చి చేరింది.

## సహ పైలట్‌తో పోరాడి.. 180 మంది ప్రాణాలు కాపాడిన భారతీయ పైలట్

సహ పైలట్ దాడి చేసినా.. ప్రాణాలకు తెగించి మరీ ఆయన 180 మంది ప్రయాణికులను కాపాడారు. ఓవైపు దాడిని ఎదుర్కొంటూనే.. మరోవైపు విమానం కూలిపోకుండా నియంత్రించారు. అనంతరం ఫ్లైదుబాయ్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు ఆఫ్-డ్యూటీ పైలట్లు విమానాన్ని సురక్షితంగా సౌదీ అరేబియాలో ల్యాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్‌కు చెందిన వార్త సంస్థలు వెల్లడించాయి. దాడిలో భారతీయ కెప్టెన్‌కు గాయాలయ్యాయి. కాగా ఒమన్‌కు చెందిన పైలట్ ఈ విమానాన్ని కూల్చడానికి ప్రయత్నించాడని సమాచారం. దీనికి అడ్డుగా ఉన్న భారతీయ పైలట్‌పై కత్తితో దాడి చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భారతీయ పైలట్ అతడితో పోరాడి.. ప్రయాణికులను రక్షించారు. ప్రస్తుతం ఇద్దరు పైలట్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## పునరుత్పాదక ఇంధన రంగానికి ఊతం.. రూ.1,86,405 కోట్ల నిధులు

'పవర్ ఎవాక్యుయేషన్' అంటారు. ఇందుకోసం భారీ విద్యుత్ లైన్లు, గ్రిడ్‌లు, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌ను దేశవ్యాప్తంగా నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ భారీ మొత్తాన్ని ఖర్చు చేస్తుంది. వ్యవసాయం, పట్టణ రవాణా రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కేంద్ర మంత్రి మండలి రూ.2,79,157 కోట్ల (సుమారు రూ.2.79 లక్షల కోట్లు) విలువైన మూడు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.

### రబీ పంటలకు సవరించిన మద్దతు ధరలు

రబీ మార్కెటింగ్ సీజన్ 2027-28కి గానూ ఆరు ప్రధాన రబీ పంటలకు కనీస మద్దతు ధరలను పెంచుతూ కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని ద్వారా రైతులకు దాదాపు రూ. 90,962 కోట్ల లబ్ధి చేకూరనుంది.

## నీట్ పేపర్ లీక్ ఎఫెక్ట్ - వచ్చే ఏడాది నుంచి ప్రవేశ పరీక్షల్లో మార్పులు - 'సీబీటీ' విధానంపై కేంద్రం కసరత్తు!

కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షలు జరిపేందుకు కేంద్రం కసరత్తు- వచ్చే ఏడాది నుంచి స్టార్ట్ !

నీట్ ప్రవేశ పరీక్షను ఇకపై పెన్ అండ్ పేపర్ విధానంలో కాకుండా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలోకి మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది నీట్ పేపర్ లీక్ అయ్యి, విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ జాతీయ స్థాయిలో ఈ వైద్య విద్య ప్రవేశ పరీక్షలను సీబీటీ విధానంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోందని సంబంధిత అధికారులు తెలిపారు.

ఈ ఏడాది ప్రారంభంలో నీట్ పేపర్ లీక్ జరిగిన తర్వాత, వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను సీబీటీ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ ప్రణాళిక పరిశీలనలో ఉందని, నందన్ నిలేకని అధ్యక్షతన ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ నుంచి నివేదిక వచ్చిన తర్వాత తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని సదరు అధికారులు పేర్కొన్నారు. భారతదేశంలోని ప్రభుత్వ పరీక్ష వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి నందన్ నిలేకని అధ్యక్షతన కేంద్రం ఓ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

ఇకపై పెన్ -పేపర్ విధానానికి స్వస్తి!

ఇప్పటి వరకు నీట్ పరీక్షను పెన్ అండ్ పేపర్ విధానంలో నిర్వహిస్తూ వస్తున్నారు. కానీ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టీఏ) ఇప్పటికే చాలా ప్రవేశ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్టింగ్ విధానంలో నిర్వహిస్తోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష జేఈఈ-మెయిన్స్ , సీయూఈటీ- యూజీ, పీజీ, యూజీసీ-నెట్ , సీఎస్ఐఆర్ యూజీసీ-నెట్ వంటి పరీక్షలను సీబీటీ విధానంలోనే నిర్వహించడం జరుగుతోంది. అందుకే ఈ మౌలిక సదుపాయాల వ్యూహం అమల్లోకి వచ్చిన తర్వాత, అన్ని ప్రవేశ పరీక్షలను ఆన్ లైన్ విధానంలోకి మార్చాలని కేంద్రం ప్రణాళికలు వస్తోందని సంబంధిత అధికారులు తెలిపారు.

ప్రత్యేక వ్యూహం

దేశంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష కేంద్రాల లభ్యత ఒకేలా లేదు. అందుకే ప్రాంతాల వారీగా ఉన్న వ్యత్యాసాలను తొలగించి, అన్ని సెంటర్లలో పరీక్ష ప్రమాణాలు ఒకేలా ఉంచడానికి ఒక ప్రత్యేక వ్యూహాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి తెలిపారు. అయితే ఈ మార్పు వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, మహిళలు, ఇంటర్నెట్ సరిగ్గా లేని ప్రాంతాల అభ్యర్థులపై ఎలాంటి ప్రభావం పడుతుంది? అక్కడ సమకూర్చాల్సిన మౌలిక సదుపాయాలు ఏమిటి? అనే కోణంలో కసరత్తు జరుగుతోంది. దీనిపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)లతో సంప్రదింపులు జరుపుతున్నామని, వాటి ఆమోదంతో ముందుకెళ్తామని సదరు అధికారులు తెలిపారు. ఎందుకు ఇదంతా? ఈ ఏడాది నీట్ -యూజీ పేపర్ లీక్ కావడం వల్ల దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర నిరసనలు వ్యక్తం చేశారు. ఈ వివాదం ఎంతటి తీవ్ర రూపాన్ని దాల్చిందంటే, కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవి నుంచి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సి వచ్చింది. ఆ మరుసటి రోజు ప్రధాని మోదీ స్పందిస్తూ, ఇకపై పరీక్షల లీకేజీ జరగకుండా ఉండేందుకు, నందన్ నిలేకని అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఈ కమిటీ ఇంకా తన తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. వాస్తవానికి నీట్ పరీక్షను ఆన్ లైన్ లో సీబీటీ విధానంలోకి మార్చాలని ముందు నుంచే ప్రతిపాదనలు ఉన్నాయి.

## మంచిపేరొచ్చినా.. చెడ్డ పేరొచ్చినా ఉద్యోగుల వల్లే: సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు సాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరినీ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులుగా భావించి సేవలు అందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 10.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 4 కోట్ల మంది ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. కేవలం 3 శాతం మంది ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవ చేయడం శ్రమతో కూడుకున్న పనైనప్పటికీ, ఎంతో బాధ్యతగా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

### ఎన్నికల సమయం వచ్చినప్పుడే రాజకీయాలు..

ప్రభుత్వానికి మంచి పేరొచ్చినా, చెడ్డ పేరొచ్చినా అది పూర్తిగా



ఉద్యోగుల పనితీరు వల్లే ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పట్ల ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం సరిగా పనిచేయడం లేదనే భావన ప్రజల్లోకి వెళ్తుందని హెచ్చరించారు. అందరి సహకారంతోనే రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్నామని, ఇంకా అనేక సమస్యలు ఉన్నందున వాటిని ప్రజలకు నిత్యం సేవలందిస్తూనే పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇక అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.810 కోట్ల నిధులను విజయవంతంగా సాధించుకున్నామని సీఎం వెల్లడించారు. కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తే దాన్ని బహిరంగంగా అభినందించడానికి తమకు ఎలాంటి శషభిషలు లేవని స్పష్టం చేశారు. ఎన్నికల సమయం వచ్చినప్పుడే రాజకీయాలు, ప్రత్యర్థులు ఉంటామని... మిగతా సమయాల్లో రాష్ట్రం, కేంద్రం కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకునే ఆరోగ్యకరమైన ధోరణి ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## అక్టోబర్2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' యాత్ర- ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసిన ఇండీ కూటమి

మొదటి పేజి తరువాయి

ఈ ఓట్ల దొంగతనం వెనుక ఉండి ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఈవీఎంలకు స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అలాగే .కు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సంస్థలను బలహీనపరుస్తున్నారని, ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రభావానికి లోనవుతోందని ఖర్గే ఆరోపించారు. అక్రమ మార్గాల ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్య పనితీరుకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. "అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఇండియా బ్లాక్ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతారు. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం వద్దకు పాదయాత్ర చేస్తారు. ప్రతిపక్ష నాయకులు భారత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరనున్నారు. అక్టోబర్ రెండోవారంలో మేము వారికి ఒక వినతిపత్రాన్ని సమర్పించనున్నాం. ప్రభుత్వం సృష్టిస్తున్న రాజ్యాంగపరమైన అడ్డంకులను, మాకున్న ఇబ్బందులను రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్తాం. ప్రజలను ఇబ్బంది పెడుతూ వ్యవస్థలను నాశనం చేస్తూ వారి సొంత నిర్ణయాలతో నేడు ఈ దొంగల ప్రభుత్వాన్ని నడుపుతున్నారని రాష్ట్రపతికి తెలియజేయాలనుకుంటున్నాం. ఈ విషయంలో మేం ఎంతవరకు విజయం సాధిస్తామనేది తర్వాత చూస్తాం. అక్టోబర్- నవంబర్ నెలల్లో ఐదు ప్రధాన ర్యాలీలు నిర్వహిస్తాం. ఇందుకు సంబంధించిన వేదికలు, తేదీలు త్వరలో ఖరారు చేస్తాం. నవంబర్ 1న దిల్లీలో ఒక ప్రధాన ర్యాలీని నిర్వహిస్తాం."

మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

ఈ కీలక సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే హాజరయ్యారు. శివసేన-యూబీటీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితరులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇండియా కూటమి నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య నిర్మాణంపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌లు దాడి చేశారని అన్ని పార్టీలు భావిస్తున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి శిక్షపడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు. మరోవైపు ఈ పరిణామాలను అత్యంత కుంభకోణంతో కూడుకున్న విషయంగా మమతా బెనర్జీ అభివర్ణించారు. జజజ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన్ను తొలగించకపోతే ఆందోళనలు ప్రతి మూలకూ విస్తరిస్తామని దీదీ హెచ్చరించారు. ప్రధాని మోదీ సైతం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "ప్రజల ఓట్లను దోచుకుని, మోసం చేస్తే ఇక ఈ దేశం ఎక్కడికి పోతుంది? ఇది మా విన్నపం కాదు, మా డిమాండ్. జ్ఞానేష్ కుమార్‌ను తొలగించకపోతే, ఈ ఆందోళన తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది. ఓట్లను దోచుకున్నారు కదా? అసలు ఈవీఎం యంత్రాన్ని ఎందుకు ఉపయోగించారు? ఆ శివ ఖన్నా ఎవరు? అతను




సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అతనికి ఆ సాఫ్ట్‌వేర్ ఎక్కడి నుంచి వచ్చింది? ఒక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసి దాని ద్వారా పూర్తిగా దోచుకున్నారు. వారు ఆ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఈఆర్‌ఓలను పూర్తిగా స్తంభింపజేశారు. మొత్తం వ్యవస్థను ప్రమాదంలో పడేశారు. సీఈసీ ఆ పదవిలో ఒక్క నిమిషం కూడా కొనసాగే అర్హత లేదు. తక్షణమే రాజీనామా చేయాలి. ఆయనతో పాటు ప్రధాని మోదీ కూడా రాజీనామా చేయాలి."

మమతాబెనర్జీ, టీఎంసీ అధినేత్రి

మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆయనను వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మండిపడ్డారు. దేశంలో జీవితకాల సంపూర్ణ చట్టపరమైన రక్షణను అనుభవిస్తున్న ఏకైక పౌరుడు జ్ఞానేష్ కుమార్ అని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు.

## కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ...

మొదటి పేజి తరువాయి

పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు



లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

## పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి.. 60 వేల మందికి పట్టాలు ఇచ్చాం

మొదటి పేజి తరువాయి

మార్కెట్ విలువ రూ.52 వేల కోట్లని వెల్లడించారు.

అందుకే పేదలకు పట్టాభిషేకమని పేరు పెట్టాం..

130 చ.గ లు యావరేజ్‌ను ఇచ్చామని, సరాసరి కోటి నుంచి రెండు కోట్ల ఆస్తిని అప్పగించామని సీఎం తెలిపారు. అందుకే పేదలకు పట్టాభిషేకమని పేరు పెట్టినట్లు పేర్కొన్నారు. యాభై, అరవై ఏళ్ల కలను సాకారం చేశామన్నారు. నిన్నటి వరకు ఆస్తి ఉన్నప్పటికీ దానిని ఉపయోగించే పరిస్థితి లేదని.. ఇప్పుడు పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి అని చెప్పుకొచ్చారు. 'ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వారికి పట్టాలు ఇచ్చాం.. ఇందుకు కృషి చేసిన మీ ఎమ్మెల్యేలు, అధికారులకు మీరు కృతజ్ఞత చెప్పాలి. ఎన్నికలలో మేము సుపరిపాలన అందిస్తామని చెప్పాం. మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చాం' అని అన్నారు.

### అమ్ముకోవద్దు.. కాపాడుకోండి

ఐదేళ్ల విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించామని ముఖ్యమంత్రి అన్నారు. కూడు, గూడు, గుడ్డ పేదలకు ఇవ్వాలని అన్న ఎన్టీఆర్ మొదలు పెట్టారని.. అదే విధానాన్ని తాము అమలు చేసి పేదల గుండెలో ఆనందాన్ని నింపామని చెప్పారు. అబ్జక్షన్ లేని భూములను పేదలకు ఇవ్వాలని నిర్ణయించి అమలు చేశామన్నారు. 'ఇది వారసత్వ హక్కు.. మీరు అమ్ముకోవద్దు.. కాపాడుకోండి' అని సూచించారు. పేదలు శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకుని ఆనందంగా జీవించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సేవలను సులభతరం చేశామని చెప్పారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఇటువంటి ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### రాజముద్రతో మీ ఆస్తులు మీకిచ్చాం..

2019-24 మధ్య ప్రభుత్వమే భూవివాదాలను ప్రోత్సహించిందని చంద్రబాబు విమర్శించారు. ప్రజల ఆస్తులపై వారి ఫొటోలు పెట్టుకున్నారని వైసీపీపై మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వంలో నా ఫొటో లేదు, నా మిత్రుడు పవన్ కల్యాణ్ ఫొటో లేదు. కేవలం ప్రభుత్వం రాజముద్రతో మీ ఆస్తులు మీకు ఇచ్చాం' అని వెల్లడించారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ ద్వారా ఆస్తులు కొల్లగొట్టాలని చూశారని ఆరోపించారు. కీలుబొమ్మల్లాగా ప్రజలను ఆడించాలని చూస్తే ప్రజలు వారికి బుద్ధి చెప్పారన్నారు. తాము ఆ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామని.. పేదల ఆస్తులకు భద్రత, భరోసా కల్పించామని చెప్పారు. రూపాయి కూడా లేకుండా ఉచిత రిజిస్ట్రేషన్ చేయించామని తెలిపారు.

### వేగంగా అభివృద్ధి పనులు..

రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం చేశామని సీఎం తెలిపారు. అన్ని రహదారుల నిర్మాణం చేశామని, ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని అన్నారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు ఇచ్చామని.. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేస్తున్నామని చెప్పారు. వైసీపీ గొడ్డలి పార్టీ పట్టిసీమకు అడ్డుపడితే... తాము కట్టి చూపామన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్దకు 490 టీఎంసీల నీరు గోదావరి నుంచి మళ్లించామన్నారు. ఈ ఏడాది వర్షాలు లేవని.. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు సాగు, తాగు నీరు ఇచ్చామని తెలిపారు. 14 వందల టీఎంసీల గోదావరి నీరు సముద్రంలోకి వెళుతున్నాయని, వంద టీఎంసీల నీరు తెస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు.

### ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



'మీకు హామీ ఇస్తున్నా.. పోలవరం పూర్తి చేస్తాం... నీటిని కృష్ణా డెల్టా, రాయలసీమకు మళ్లిస్తాం. కొంతమంది స్వార్థపరులు వారు బాగుంటే చాలు అనుకుంటారు. మేము అందరూ బాగుండాలని, ఆనందంగా ఉండాలని కోరుకుంటాం. గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణ రాష్ట్రాలకు నీటి కొరత ఉండదు. భవిష్యత్తులో 36 ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. కృష్ణా పుష్కరాల సమయానికి గోదావరి, కృష్ణా నీరు పుష్కలంగా మనకి వస్తాయి. అభివృద్ధి, సంక్షేమం ఈ ప్రభుత్వానికి రెండు కళ్లు. పేదలకు ఆదాయ మార్గాలు చూపి జీవన ప్రమాణాలు పెంచాలి. రేపు ఉదయం ఆరు గంటలకే గుడ్ మార్నింగ్ చెప్పి పెన్షన్ అందిస్తాం. ఉద్యోగులకు ఆలస్యం అయినా.. పెన్షన్‌దారులకు ఆలస్యం చేయకుండా అందిస్తున్నాం. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగింది. భవిష్యత్తులో ఏసీ బస్సులే కొంటాం.. పేదలు అందులోనే ప్రయాణం చేయాలి' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు.. ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

### యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం

యువత తమను అడుగుతున్నది ఒక్కటేనని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారని లోకేశ్ చెప్పారు. అందుకే ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మారుస్తున్నామని, వివిధ రంగాల్లో పెట్టుబడులు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని చెప్పారు.

### జెన్-జీ మార్పు కోరుకుంటోంది

కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా యువతలో కొత్త మార్పు కనిపిస్తోందని లోకేశ్ అన్నారు. వ్యవస్థలో మార్పులు రావాలని కోరుకుంటున్న యువత ఒక వర్గంగా ముందుకు వస్తోందని చెప్పారు. యువతతో కలిసి సమస్యలకు పరిష్కారాలు వెతకడం తనకు ఉత్సాహాన్నిస్తోందన్నారు.

### డీఎస్సీపై ఆరోపణలు.. సర్టిఫికెట్లపై క్లారిటీ

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించామని లోకేశ్ తెలిపారు. క్రీడా కోటాలో ఎంపికైన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు,



ఎమ్మెల్యేలే జారీ చేశారని చెప్పారు. ఈ అంశంపై కోర్టు, సీబీఐ దర్యాప్తు కోరినా.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

### అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్

క్వాంటమ్ టెక్నాలజీ ఊహ కాదని.. ఇది నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ అని లోకేశ్ అన్నారు. తొలి 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పరిశోధనలు, మెటీరియల్ సైన్స్, క్రయోజెనిక్ టెక్నాలజీ వంటి రంగాల్లో పని చేస్తూ క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు.

### విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

విద్యా వ్యవస్థ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మారాలని లోకేశ్ అన్నారు. గత రెండేళ్లలో 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. ఏఐ నుంచి క్వాంటమ్ వరకు భవిష్యత్ టెక్నాలజీలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలకు కనీసం దశాబ్ద కాలం పడుతుందని పేర్కొన్నారు.

### పెట్టుబడులకు '3ఎస్' మంత్రం

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే 3ఎస్ విధానాన్ని అనుసరిస్తున్నామని లోకేశ్ చెప్పారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వడం, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులకు తెలియజేయడం, ప్రభుత్వాలు మారినా విధానాల్లో స్థిరత్వం ఉండేలా చూడటం తమ విధానమన్నారు. వ్యవసాయం నుంచి క్వాంటమ్ వరకు 23 క్లస్టర్లలో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

## జిల్లా స్థాయి జిగ్‌జాగ్ రన్నింగ్‌లో వరుణ్ దేశ్ సత్తా

### స్పెషల్ కేటగిరీలో ప్రథమ స్థానం.. ఉపాధ్యాయుల అభినందనలు



మందమర్రి, సెప్టెంబర్ 30 :మంచిర్యాల జిల్లాస్థాయిలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో మందమర్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఫిల్టర్‌బెడ్‌కు చెందిన విద్యార్థి చిరంజీవి వరుణ్ దేశ్ ప్రతిభ చాటాడు. జిగ్‌జాగ్ రన్నింగ్ స్పెషల్ కేటగిరీ విభాగంలో పోటీపడి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు.జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచిన వరుణ్ దేశ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. క్రీడలపై ఆసక్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవితో పాటు ఉపాధ్యాయులు భీమ్‌పుత్ర శ్రీనివాస్, జలంపెల్లి, చింతకింది లలిత, గుడివెనుక రవి, జి. కిరణ్ తదితరులు వరుణ్ దేశ్‌ను అభినందించారు.ద

## చేయూత పింఛన్ల వెరిఫికేషన్‌పై
## అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### అర్హులైన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచన



మందమర్రి, సెప్టెంబర్ 30 :చేయూత పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) పి. చంద్రయ్య అధికారులను ఆదేశించారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ ప్రాంతంలో జరుగుతున్న పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వెరిఫికేషన్‌కు సంబంధించిన వివరాలను పరిశీలించిన అదనపు కలెక్టర్.. అర్హులైన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా పరిశీలించి నమోదు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. వెరిఫికేషన్‌లో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు.అదనపు కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు ఉన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ఈ. రాజేశ్వరి, 19వ వార్డు ఆఫీసర్ ఎస్. రాజేశ్వర్ రావు, డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బి. శ్యాంబాబు, సిస్టమ్ మేనేజర్ ఏ. శిరీష్ తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి
## తల్లిదండ్రులుఉపాధ్యాయుల సమన్వయం

### విద్యార్థుల ప్రగతిపై చర్చించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు



నస్పూర్, సెప్టెంబర్ 30:నస్పూర్ మండలం విద్యానగర్ లోని శ్రీ కృష్ణవేణి ప్లే అండ్ హైస్కూల్‌లో ప్రధానో పాధ్యాయులు బత్తిని దేవన్న ఆధ్వర్యంలో తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి,క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం,పాఠశాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.సమావేశంలో ప్రధానోపాధ్యాయులు బత్తిని దేవన్న మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు.పిల్లలకు ఇంటి వద్ద ప్రశాంతమైన, అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు చదువుపై శ్రద్ధ చూపించాలని సూచించారు.సమయపాలన, క్రమశిక్షణ,మంచి అలవాట్లను చిన్ననాటి నుంచే పెంపొందించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.విద్యార్థులు నిర్వహించిన ఎఫ్‌ఏ-1, ఎఫ్‌ఏ-2 పరీక్షల ఫలితాలు, విద్యా ప్రగతి,అభ్యసన స్థాయిపై తల్లిదండ్రులతో చర్చించారు.విద్యార్థుల చదువులో పురోగతిని తెలుసుకునేందుకు తల్లిదండ్రులు పాఠశాల డైరీలను క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు.డైరీలో ఉపాధ్యాయులు నమోదు చేసే సూచనలు,ఇంటి పనులు,ఇతర ముఖ్యమైన సమాచారాన్ని గమనిస్తూ పిల్లల చదువులో తగిన సహకారం అందించాలని కోరారు.విద్యార్థుల విద్యా ప్రగతి,వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్తు అభివృద్ధికి తల్లిదండ్రులు--ఉపాధ్యాయులు పరస్పరం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో పేర్కొన్నారు.పాఠశాలలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతికి సంబంధించి తల్లిదండ్రుల నుంచి విలువైన సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు.తల్లిదండ్రుల సహకారం,ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయిస్తూ సమావేశం ముగిసింది.

## పనిచేయని వాటర్ ప్లాంట్
## బాలికలకు తాగునీటి ఇబ్బందులు

### మరమ్మతులు చేపట్టాలని ప్రజా వెల్ఫేర్ సొసైటీ డిమాండ్



మందమర్రి, సెప్టెంబర్ 30 :వందలాది మంది విద్యార్థినులు చదువుకుంటున్న పాఠశాలలో తాగునీరు అందించే వాటర్ ప్లాంట్ పనిచేయ కపోవడంతో బాలికలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. మందమర్రి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ కొంతకాలంగా పనిచేయకుండా మూలన పడిఉందని ప్రజా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు.విషయం తెలుసుకున్న ప్రజా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అజీముద్దీన్ పాఠశాలను సందర్శించి పనిచేయని వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో వందలాది మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారని, వారికి అత్యవసరమైన తాగునీటిని అందించే వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడం ఇబ్బందికరంగా ఉందన్నారు.సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టి విద్యార్థినులకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ప్రజా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల
## సొంతింటి కల సాకారానికి పోరాటం

### యువ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి: తుమ్మల రాజారెడ్డి



నస్పూర్, సెప్టెంబర్ 30:సింగరేణి కార్మికుల సొంతింటి కల సాకారం చేయడంతో పాటు కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం పోరాటం చేస్తామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి అన్నారు.కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై యువ కార్మికులు పెద్ద సంఖ్యలో సంఘంలో చేరుతున్నారని తెలిపారు.బుధవారం శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్‌పీ-3 గని వద్ద గోదారి భాగ్యరాజు ఆధ్వర్యంలో సీఐటీయూ నూతన పిట్ కమిటీని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సంఘంలో చేరిన పలువురు యువ కార్మికులకు తుమ్మల రాజారెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు.నూతన పిట్ కమిటీ కార్యదర్శిగా సాయిళ్ల శ్రీనివాస్,సహాయ పిట్ కార్యదర్శిగా ఆషాడం రమేష్,మైన్ ఇన్‌చార్జిగా ఇత్తినేని వెంకటేష్,సోషల్ మీడియా ఇన్‌చార్జిలుగా మాదాసు విజయ్,దొంతుల సాయి,జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా చీకట్ల సాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎస్. రాజేందర్,గుల్షన్ కుమార్,తోట విజయ్,ఏ రిలే ఇన్‌చార్జిగా వెంగళ శ్రీనివాసు నియమితులయ్యారు.ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ యువ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ అండగా ఉంటుందని అన్నారు.సింగరేణిలో అర్హత కలిగిన యువ కార్మికులకు వారి విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.క్లర్క్, ఎస్అండ్‌పీసీ తదితర అంతర్గత పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేసి పరీక్షలు నిర్వహించాలని కోరారు. గత 14 ఏళ్లుగా భర్తీ కాని ఎస్అండ్‌పీసీ పోస్టులను అర్హత కలిగిన యువ కార్మికులు, కార్మికురాళ్లతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.అర్హతకు తగిన పని లభించకపోవడం వల్ల కొంతమంది కార్మికుల్లో గైర్హాజరు పెరుగుతోందని పేర్కొన్నారు.కౌన్సెలింగ్ సమయంలో గైర్హాజరుకు గల కారణాలను గుర్తించి, కార్మికుల అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా తగిన పని కేటాయించాలని సూచించారు.యువ కార్మికుల నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుంటే సంస్థ అభివృద్ధికి వారు మరింతగా దోహదపడతారని తుమ్మల రాజారెడ్డి అన్నారు.

# ఫోర్‌వేపై క్రమశిక్షణే ప్రాణ రక్షణ

### ద్విచక్ర వాహనదారులు ఎడమవైపు లైన్‌లోనే.. యూటర్న్ సమయంలో అప్రమత్తత తప్పనిసరి




ఆసిఫాబాద్ ప్రత్యేక కథనం ఫోర్‌వే రహదారులపై వాహనాల వేగం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి రహదారుల్లో వాహనదారులు క్రమశిక్షణతో ప్రయాణిస్తే ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఎడమవైపు లైన్‌లో ప్రయాణిస్తూ, అవసరం లేకుండా మధ్య లైన్‌లోకి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. మధ్యలో, డివైడర్‌కు సమీపంలోని లైన్‌లలో వేగంగా ప్రయాణించే కార్లు, ఇతర వాహనాలు వస్తుంటాయి. అలాంటి సమయంలో ద్విచక్ర వాహనాలు ఒక్కసారిగా లైన్ దాటితే వెనుక నుంచి వచ్చే వాహనాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుంది.

### ఇష్టారీతిన లైన్ దాటొద్దు

ముందున్న వాహనాన్ని తప్పించుకోవడం, ఓవర్‌టేక్ చేయడం లేదా ఇతర కారణాలతో ఒక్కసారిగా లైన్ మార్చడం ప్రమాదకరం. లైన్ మార్చాల్సిన అవసరం ఉన్నప్పుడు ముందుగా వెనుక నుంచి వచ్చే వాహనాలను గమనించాలి. సూచికను ఉపయోగించి, తగినంత ఖాళీ ఉన్నప్పుడే నెమ్మదిగా మరో లైన్‌లోకి వెళ్లాలి. చిన్న వాహనమనే కారణంతో ఎక్కడ పడితే అక్కడ లైన్ దాటడం సురక్షితం కాదు.

### యూటర్న్ వద్దే ఎక్కువ అప్రమత్తత

ఫోర్‌వేలో యూటర్న్ తీసుకునే సమయంలో మరింత జాగ్రత్త అవసరం. యూటర్న్ ప్రాంతానికి చేరుకునే ముందే వాహన వేగాన్ని తగ్గించాలి. వెనుక నుంచి వస్తున్న వాహనాలను అద్దాల్లో పరిశీలించడంతో పాటు పక్క లైన్‌లో వాహనం ఉందా లేదా గమనించాలి. సూచిక ఇచ్చి, రహదారి ఖాళీగా ఉందని నిర్ధారించుకున్న తర్వాతే యూటర్న్ తీసుకోవాలి.వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనాన్ని గమనించకుండా ఒక్కసారిగా యూటర్న్ చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఫోర్‌వేలో వాహనాలు అధిక వేగంతో వస్తుండటంతో క్షణిక నిర్లక్ష్యం కూడా తీవ్ర పరిణామాలకు దారితీయవచ్చు.

### పోలీసుల అవగాహన అవసరం

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా పోలీసు అధికారులు కూడా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఫోర్‌వేల్లో ఏ లైన్‌లో ఏ వాహనం ప్రయాణించాలి, లైన్ మార్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యూటర్న్ చేసే విధానం, సూచికల వినియోగం, వేగ నియంత్రణ తదితర అంశాలపై వాహనదారులకు స్పష్టంగా వివరించాలి. ముఖ్యంగా రద్దీ ప్రాంతాలు, యూటర్న్ ప్రదేశాలు, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలి.

### వేగం కంటే జాగ్రత్త ముఖ్యం

ఫోర్‌వే రహదారులు ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి ఏర్పాటు చేసినవే కానీ.. ఇష్టారీతిన వాహనం నడపడానికి కాదు. ప్రతి వాహనదారుడు రహదారి సూచనలు, లైన్ క్రమశిక్షణ, వేగ పరిమితులను పాటించాలి. ద్విచక్ర వాహనదారులు ఎడమవైపు లైన్‌లో సురక్షితంగా ప్రయాణిస్తూ, అవసరమైనప్పుడు మాత్రమే జాగ్రత్తగా లైన్ మార్చాలి.ఒక్క వాహనదారుడి నిర్లక్ష్యం అతడికే కాకుండా వెనుక, పక్క లైన్‌లలో ప్రయాణించే ఇతరుల ప్రాణాలకూ ముప్పుగా మారుతుంది. లైన్ దాటే ముందు వెనుక చూడాలి.. యూటర్న్ చేసే ముందు అన్ని వైపులా గమనించాలి.. సూచిక ఇచ్చిన తర్వాతే మలుపు తిప్పాలి.రోడ్డు అందరిదీ.. నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత.. అవగాహన కల్పించడం, నిబంధనలు అమలు చేయడం అధికారుల బాధ్యత.

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







మంచిర్యాల,సెప్టెంబర్ 30, 2026:సాధారణంగా సాగుచేసే వరి పత్తి మొక్కజొన్న కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమానికి సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు మహేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు రత్నం సుకుమారి, రామగిరి బానేష్, అక్కల వెంకటేశ్వర్లు, దుర్గం లక్ష్మీనారాయణ, మహేష్ ప్రసాద్ తివారి, ఆత్మ చైర్మన్ లు ఆర్. సత్తయ్య, ఓడేటి హనుమంతు, సింగతి మురళి, రఘునందన్ రెడ్డి లతో కలిసి హాజరై స్టాళ్లను పరిశీలించి, మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వరి, పత్తి పంటలతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండి అధిక లాభాలను అందించే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. ఫర్టిలైజర్స్, సేంద్రియ వ్యవసాయం, పామాయిల్ సాగు, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలు, మత్స్యశాఖకు సంబంధించిన ఉత్పత్తులు, వ్యవసాయానికి ఉపయోగపడే ఎలక్ట్రానిక్ వాహనాలు రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. సాంకేతికతతో రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలని, ఆధునిక వ్యవసాయ సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకుని, ఉత్పాదకతను పెంచుకోవచ్చని రైతులకు సూచించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ పరిస్థితులు, పంటలకు లభించే ధరలు, సాగు వ్యయం, నీటి లభ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అధిక లాభాలను అందించే పంటలను ఎంచుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్, పందిరి సాగు, పండ్ల సాగు వంటి పంటలపై దృష్టి సారించేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంలో అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారుల కొరకు చేప పిల్లలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిందని తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని సాగు ప్రణాళిక పకడ్బందీగా చేసుకోవాలని, నానో యూరియా, నానో డి ఎ పి వినియోగం వలన కలిగే లాభాలను రైతులకు వివరించాలని తెలిపారు. రైతుల కొరకు జిల్లాలోని లక్సెట్టిపేటలో విత్తన శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులు తెలుసుకోవాలని తెలిపారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీ, సహకారాన్ని రైతులకు వివరించి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆరోగ్యమైన పంట ఉత్పాదకత పెంపొందించేలా అధికారులు, స్వయం సహాయక సంఘాల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.సిర్పూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవాలని, ప్రజలకు ఆరోగ్యకరమైన, సహజసిద్ధమైన పంట ఉత్పత్తులను అందించేలా కృషి చేయాలని తెలిపారు. వరి, మొక్క, పత్తి వంటి సాధారణ పంటలే కాకుండా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కల్పిస్తున్న అవకాశాలపై రైతులు చైతన్యవంతులు కావాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు అందిస్తున్న పంట మెలకువలు, సూచనలను పాటిస్తూ తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ పంట దిగుబడి సాధించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా రైతులు ముందుకు రావాలని తెలిపారు.అనంతరం జిల్లాలో ఉత్తమంగా వ్యవసాయం చేస్తున్న రైతులను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, వివిధ సంస్థల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# సింగరేణిలో వేల కోట్ల కుంభకోణం

### కాంగ్రెస్ హయాంలో సింగరేణి నిర్వీర్యం
### సింగరేణి ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమమే
### రేవంత్ రెడ్డి తుగ్లక్ చర్యలు మానుకోవాలి
### మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్



శ్రీరాంపూర్,సెప్టెంబర్ 30,: సింగరేణిలో వేలుకోట్ల కుంభకోణం జరుగుతోందని, కాంగ్రెస్ హయాంలో సింగరేణి నిర్వీర్యం అయిపోయిందని, తక్షణమే తుగ్లక్ చర్యలు మానుకొని సింగరేణి ఉత్పత్తిని పెంచాలని బుధవారం తెలంగాణ భవన్లో జరిగిన మీడియా సమావేశం లో మాజీ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు.సింగరేణి ప్రైవేటీకరణ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ..సింగరేణిలో బొగ్గు గనుల ప్రైవేటీకరణ అడ్డుకుంటామని,వారసత్వ ఉద్యోగాలు ఇస్తామని,కార్మికులకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని,అనేక రకాల హామీలిచ్చి ఐఎన్‌టీయూసీ అధికారంలోకి వచ్చిందని కానీ అధికారంలోకి వచ్చాక సింగరేణి మొత్తాన్ని నిర్వీర్యం చేస్తున్నారని వాపోయారు.సింగరేణిని స్కాములమయం చేస్తున్నారని,ఇప్పటికే రూ.10 వేల కోట్ల అవినీతి జరిగిందని అంచనా వేసినట్లు తెలిపారు.సైట్ విజిట్ పేరుతో టెండర్లలో అక్రమాలు జరిగాయని,రేవంత్ బామ్మర్ది సృజన్ రెడ్డి సింగరేణిని దోచుకు తింటున్నాడని,రూ.480 కోట్ల విలువైన టెండర్లలో స్కామ్,రెండు సోలార్ ప్లాంట్ టెండర్లలో వెయ్యి కోట్ల స్కామ్ జరిగిందని పేర్కొన్నారు.జైపూర్ పవర్ ప్లాంటులో సగం ప్రొడక్షన్ మాత్రమే జరుగుతోందని,సింగరేణికి ప్రతీరోజు కోట్లాది రూపాయల నష్టం చవి చూస్తోందని,సింగరేణి ప్లాంటు ర్యాంకు దారుణంగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.సింగరేణి బొగ్గును మాయం చేస్తున్నారని,జిలెటిన్ స్టిక్స్‌లో రూ.300 కోట్ల కుంభకోణం చేశారని,డీజిల్ కొనుగోళ్లలో కూడా వందల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు.లాభాల వాటాను తగ్గించి కార్మికులకు అన్యాయం చేశారని,ఒక్కో కార్మికుడికి రూ.1.80 లక్షలు తక్కువ ఇచ్చారని,సింగరేణి మొదటిసారి రూ.4300 కోట్ల ఓవర్ డ్రాఫ్ట్‌కు పోయిందన్నారు.రేవంత్ ఫుట్ బాల్ సోకులకు సింగరేణి డబ్బు వాడుకున్నారని,నేటి గుర్తింపు సంఘం సింగరేణిని ఫుట్ బాల్ ఆడుకుంటోందని ఎద్దేవా చేశారు.సింగరేణిలో అవినీతిపై కేటీఆర్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారని,సీఎం రేవంత్‌కు కూడా కేటీఆర్ బహిరంగ లేఖ రాశారని,దసరా లాభాల వాటాను 36 శాతం ఇవ్వాలని అడిగినట్లు తెలిపారు.బీఆర్ఎస్ ప్రభుత్వం 16 వేల వారసత్వ ఉద్యోగాలు ఇచ్చిందని,కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ బోర్డులు ఆపేసిందని,నెలకు మూడు మెడికల్ బోర్డులు పెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారన్నారు.కార్మికులకు సొంతింటి స్థలం ఇవ్వాలని,మారుపేర్ల సమస్య,డిస్మిస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు.సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వ వాటాను ప్రైవేటుకు అమ్మే కుట్ర జరుగుతుందని,అలాంటి నిర్ణయాన్ని వెంటనే వాపస్ తీసుకోవాలని,సింగరేణిని బతికించుకోవాలి,బలోపేతం చేసుకోవాలని సుమన్ పిలుపునిచ్చారు.సీఎం రేవంత్ డైరెక్షన్ ప్రకారమే ప్రైవేటీకరణ కుట్ర జరుగుతుందని,సింగరేణి వాటా అమ్మితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని,అలాంటి ఆలోచన లేకపోతే సింగరేణిని ఎవరికీ అమ్మబోమని ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం సింగరేణికి రూ.60 వేల కోట్ల బకాయిలు పడిందని,సింగరేణిలో కొత్త యంత్రాలు కొనే పరిస్థితి లేదని,డంపర్లకు కొత్త టైర్లు కొనే పరిస్థితి కూడా లేదని,యంత్రాలకు అవసరమైన ల్యూబ్రికెంట్‌కు కూడా దిక్కులేదని ఎత్తిచూపారు.సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడుతోందని,రూ.60 వేల కోట్ల బకాయిలు వెంటనే సింగరేణికి చెల్లించాలని,2023లో 70 వేల మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిన సింగరేణి,2025 నాటికి 48 వేల మిలియన్ టన్నులకు పడిపోవడం శోచనీయమని అన్నారు.స్కాముల వల్ల సింగరేణి ఘోరంగా దివాలా తీస్తుందని,సంస్థను నిర్వహించే సత్తా లేకనే సింగరేణిని అమ్మే కుట్ర చేస్తున్నారని,ఉద్దేశపూర్వకంగానే సింగరేణిని స్లో డౌన్ చేస్తున్నారని,51 శాతం ప్రైవేటు వారికి అమ్ముకోవడానికే ఇదంతా కథ అల్లుతున్నారని తెలిపారు.టన్ను రూ.3800కు దొరికే బొగ్గును కాదని,రూ.10 వేలు విలువ చేసే బొగ్గు తెస్తారని చెప్పడం విడ్డూరంగా ఉందని,సింగరేణిలో గ్రేడ్ 9 బొగ్గు ఉండగా విదేశీ బొగ్గు ఎందుకని ప్రశ్నించారు.విదేశీ బొగ్గు దిగుమతి వెనక వేల కోట్ల కుంభకోణం ఉందని,వెంటనే తుగ్లక్ చర్యలను మానుకోని తక్షణమే సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పెంచాలని,సింగరేణికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని అన్నారు.ఐఎన్‌టీయూసీ మేనిఫెస్టోలోని 34 అంశాల్లో ఒక్కటి కూడా నెరవేరలేదని,సింగరేణిని నాశనం చేస్తున్న తీరును బీఆర్ఎస్ ఖండిస్తోందని,సింగరేణిని కాపాడుకోవడానికి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని,సింగరేణి సంస్థ లక్షలాది మంది ప్రజల జీవనాధారమని,సింగరేణి సంస్థ బతికి ఉండాలన్నారు.అక్టోబర్ 5న సింగరేణి నియోజకవర్గాల నేతలతో కేటీఆర్ అధ్యక్షతన సమావేశం అనంతరం అదే రోజు తెలంగాణ భవన్‌లో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.సింగరేణిని ఖతం చేయాలని చూస్తే,కార్మిక సైన్యం తెగించి సకల జనుల సమ్మె తరహా ఉద్యమం చేస్తామని బాల్క సుమన్ బీఆర్ఎస్ పార్టీ తరపున హెచ్చరించారు.

# 'బేర్'మన్న స్టాక్ మార్కెట్లు - సెన్సెక్స్ 1100 పాయింట్లకుపైగా డౌన్- రూ.8 లక్షల కోట్లు ఆవిరి

1,124 పాయింట్లు పతనమైన సెన్సెక్స్- 23 వేల మార్కు దిగువకు నిఫ్టీ- రూ.474 లక్షల కోట్లకు పడిపోయిన బీఎస్ఈ కంపెనీల విలువ



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం కూడా భారీ నష్టాలు మిగిల్చాయి. ఉదయం నుంచి మొదలైన నష్టాలు గంటలు గడిచే కొద్దీ మరింత తీవ్రమయ్యాయి. అంతర్జాతీయ పరిణామాలు, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ మదుపర్ల అమ్మకాలు మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపించాయి. దీంతో సెన్సెక్స్ ఏకంగా 1,124 పాయింట్లకు పైగా పతనమైంది. నిఫ్టీ కూడా 360 పాయింట్లు కోల్పోయి 23 వేల మార్కుకు దిగువన స్థిరపడింది.

1,124 పాయింట్లు డౌన్

సెన్సెక్స్ ఉదయం 73,734.83 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైంది. క్రితం సెషన్‌లో 73,895.74 వద్ద ఉన్న సూచీ.. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఒక దశలో 72,716.23 పాయింట్ల కనిష్ఠానికి పడిపోయింది. చివరికి 1,124.02 పాయింట్ల నష్టంతో 72,771.72 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా అదే బాటలో నడిచింది. 360.25 పాయింట్లు కోల్పోయి 22,780.25 వద్ద ముగిసింది. దీంతో 23 వేల మార్కుకు దిగువన స్థిరపడింది. సెన్సెక్స్‌లో ఇన్ఫోసిస్ మినహా మిగిలిన షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఎల్అండ్‌టీ, పవర్‌గ్రిడ్, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లలో ఎక్కువగా అమ్మకాలు కనిపించాయి.

చమురు ధరల మంట

మార్కెట్ల పతనానికి ప్రధాన కారణాల్లో ముడి చమురు ధరల పెరుగుదల ఒకటి. హార్మూజ్ జలసంధిని తెరిచేలా వచ్చిన శాంతి ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించినట్లు వార్తలు రావడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు మళ్లీ పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర ఒక దశలో 108 డాలర్లకు చేరింది. క్రితం సెషన్‌తో పోలిస్తే దాదాపు 4 శాతం పెరిగింది. చమురు ధరలు ఇలాగే పెరుగుతూ పోతే ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం మళ్లీ పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు మదుపర్లలో కనిపించాయి. భారత్‌కు ముడి చమురు ధరలు చాలా కీలకం. దేశం పెద్ద మొత్తంలో చమురును దిగుమతి చేసుకుంటుంది. ధరలు పెరిగితే దిగుమతుల కోసం ఎక్కువ మొత్తంలో విదేశీ మారకం చెల్లించాల్సి ఉంటుంది. దీంతో రూపాయిపై ఒత్తిడి పెరగొచ్చు. అదే సమయంలో రవాణా, ఉత్పత్తి వంటి ఖర్చులు పెరిగి కంపెనీల లాభాలపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

అమెరికా బాండ్ల ప్రభావం

అమెరికా ప్రభుత్వ బాండ్లపై రాబడులు కూడా మార్కెట్లను ప్రభావితం చేశాయి. 10 ఏళ్ల అమెరికా బాండ్ రాబడి 5 శాతానికి పైగా కొనసాగుతోంది. అమెరికా బాండ్లలో ఎక్కువ రాబడి లభిస్తే విదేశీ మదుపర్లు అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్ల నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకునే అవకాశం ఉంటుంది. భారత మార్కెట్లలోనూ ఇదే ప్రభావం కనిపిస్తోంది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు వరుసగా షేర్లను విక్రయించడం అమ్మకాల ఒత్తిడిని పెంచుతోంది. శుక్రవారం ఒక్కరోజే విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.3,696 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు.

రూ.8 లక్షల కోట్లు ఆవిరి

మార్కెట్ల భారీ పతనంతో మదుపర్ల సంపద కూడా గణనీయంగా తగ్గింది. బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.8 లక్షల కోట్లు తగ్గి రూ.474 లక్షల కోట్లకు చేరింది. అంటే ఒక్కరోజులోనే మార్కెట్ విలువ పరంగా మదుపర్ల సంపదలో భారీ మొత్తం తగ్గిపోయింది. అయితే ఇది నేరుగా అందరి ఖాతాల్లోని నగదు అంతా పోయిందని అర్థం కాదు. షేర్ల మార్కెట్ విలువ తగ్గడంతో మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ తగ్గింది.

రూపాయి కూడా ఒత్తిడిలోనే

డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా ఒత్తిడిలో కొనసాగుతోంది. సోమవారం డాలరుతో రూపాయి మారకం విలువ 96.03గా ఉంది. ఒకవైపు చమురు ధరలు పెరగడం, మరోవైపు విదేశీ పెట్టుబడులు బయటకు వెళ్లడం రూపాయిపై ఒత్తిడిని పెంచుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ఔన్సు ధర 4,154 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అలా చమురు ధరలు, అమెరికా బాండ్ రాబడులు, విదేశీ మదుపర్ల అమ్మకాలు కలిసి దేశీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపించాయి. గతవారం తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొన్న మార్కెట్లు, ఈ వారం తొలి రోజే భారీ నష్టాలతో ప్రారంభించడం మదుపర్లలో ఆందోళన పెంచింది.

# అక్టోబరు నుంచి 'కొత్త రూల్స్' ఏం మార్పులు రానున్నాయంటే?

## యూపీఐ ఛార్జీల నుంచి ఎఫ్?డీ రేట్ల వరకు

## అక్టోబరు నుంచి అమల్లోకి రానున్న కొత్త రూల్స్ ఇవే!




?క్యాలెండర్?లో నెల మారుతుందంటే ఎన్నో కొత్త కొత్త మార్పులు, సరికొత్త రూల్స్ అమల్లోకి వస్తుంటాయి. ప్రతి నెలా మాదిరిగానే అక్టోబరులోనూ కొన్ని ముఖ్యమైన మార్పులు రాబోతున్నాయి. ఇందులో మీకు ప్రయోజనం కల్పించే వాటి డెడ్?లైన్స్? ముగియనుండటం సహా, మీ జేబుకు చిల్లు పడే నిర్ణయాలూ ఉంటాయి. ఎల్?పీజీ ఇ-క్రైవైసీ నుంచి యూపీఐ ట్రాన్సక్షన్స్?పై ఛార్జీల వరకు చాలానే నిర్ణయాలు అక్టోబరు? నుంచే అమల్లోకి రానున్నాయి. మరి, అక్టోబర్? నుంచి అమల్లోకి వచ్చే ఆ కొత్త రూల్స్?పై ఇప్పుడు ఓ లుక్కేద్దాం.

వినియోగదారులకు విధించిన బయోమెట్రిక్ ఆధార్ అథంటికేషన్ (జు-ఖీజ) గడువు సెప్టెంబర్? నెలాఖరుతో ముగియనుంది. ఇంకా ఎవరైనా ఎల్?పీజీ ఇ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయనివారు ఈ నెలాఖరులోపు కంప్లీట్ చేయాలని ఇప్పటికే కేంద్రం స్పష్టంచేసింది. ఒకవేళ గడువు ముగిసిన తర్వాత ఇ-కేవైసీ చేయకపోతే రాయితీ వర్తించదు. అక్రమ గ్యాస్ కనెక్షన్లను అడ్డుకట్ట వేయడంతో పాటు రాయితీ దుర్వినియోగం కాకుండా చేసేందుకు ఈ ప్రక్రియను తీసుకొచ్చింది ప్రభుత్వం. సో ఇంకా ఎవరైనా బయోమెట్రిక్ ఆధార్ అథంటికేషన్ పూర్తి చేయకపోతే ఆయిల్ కంపెనీల యాప్, గ్యాస్ ఏజెన్సీలు, గ్యాస్ డీలర్ల వద్ద సెప్టెంబర్ నెలాఖరులోపు ఇ-కేవైసీ పూర్తి చేయొచ్చు.

### సిలిండర్ ధరలు :

ప్రతి నెలా మొదటి తేదీన అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా గృహ, కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను సవరిస్తుంటాయి చమురు సంస్థలు. సెప్టెంబర్ నెలలో గృహ అవసరాలకు ఉపయోగించే సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచినప్పటికీ, కమర్షియల్ సిలిండర్ ధర స్వల్పంగా(రూ.10) పెంచాయి. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ ధరలను మరోసారి సవరించే ఛాన్స్ ఉంకొన్ని యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్?పీసీఐ) కొత్త విధానాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. కొత్త విధానం ప్రకారం, వ్యక్తి- వ్యాపారుల (ొ2వీ) కేటగిరీలో రూ.2000 పైబడిన లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటు (వీణ=) వర్తించనుంది. ఉదాహరణకు రూ.2వేలకు 0.4 శాతం అంటే రూ.8 అవుతుంది. అయితే ఇది వ్యాపారి వైపు వర్తించే వీణ=? మాత్రమేనని స్పష్టం చేసింది ఎన్?పీసీఐ. యూపీఐ ట్రాన్సక్షన్స్?పై విధించే ఈ ఛార్జీలు అక్టోబరు 15 అమల్లోకి రానున్నాయి. చిరు వ్యాపారులకు, వ్యక్తులు చేసే లావాదేవీలకు ఈ ఛార్జీల నుంచి మినహాయింపు కల్పించింది. అలాగే, పెట్రోల్ పంపులు, ఇన్సూరెన్స్ వంటి పేమెంట్స్?కు ఫ్లాట్ ఎండీఆర్ రూ.5 వర్తిస్తుందని పేర్కొంది ఎన్?పీసీఐ.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(=దీ×) బల్క్ డిపాజిట్లపై (రూ.3కోట్లు, అంతకంటే ఎక్కువ) వడ్డీ రేట్లను వెల్లడించే విషయంలో బ్యాంకులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఈ తరహా డిపాజిట్లపై వడ్డీ రేట్లను ప్రతి రోజూ ఉదయం 10 గంటలకల్లా తన వెబ్‌సైట్‌లో ప్రచురించాల్సి ఉంటుందని తెలిపింది. ఒకే తేదీన స్వీకరించిన డిపాజిట్లపై వడ్డీ రేటును నిర్ణయించేటప్పుడు బ్యాంకులు కస్టమర్ల మధ్య గానీ, బ్రాంచీల మధ్య గానీ వివక్ష చూపకూడదని పేర్కొంది ఆర్‌బీఐ.

# గుడ్ న్యూస్?- భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు- సెప్టెంబర్? 28న ఏపీ, తెలంగాణలో తులం రేటు ఎంతంటే?

## గుడ్ న్యూస్?- భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు- సెప్టెంబర్? 28న ఏపీ, తెలంగాణలో తులం రేటు ఎంతంటే?



నేటి గోల్డ్, సిల్వరే రేట్లు- తెలుగు రాష్ట్రాల్లో ఎలా ఉన్నాయంటే?

దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు, ఆర్థిక అనిశ్చితులు, ముడిచమురు ధరలు, కరెన్సీ మారకం విలువల్లో మార్పులు, దేశీయ డిమాండ్-సరఫరా మొదలైన అంశాలు బంగారం, వెండి ధరలపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి.

క్యాప్స్ గోల్డ్ వెబ్‌సైట్ ప్రకారం, హైదరాబాద్‌లో శుక్రవారం 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం 10 గ్రాముల ధర రూ.1,55,800గా ఉండగా, సోమవారం నాటికి రూ.2,600 తగ్గి రూ.1,53,200కు తగ్గింది. విశాఖపట్నం?, విజయవాడ, నెల్లూరు, ప్రొద్దుటూరు తదితర నగరాల్లోనూ ఇవే ధరలు ఉన్నాయి. ఆభరణాల తయారీలో ఎక్కువగా వినియోగించే 22 క్యారెట్ల బంగారం ధర విషయానికి వస్తే 10 గ్రాములు రూ.1,39,950గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్? స్పాట్? గోల్డ్ ధర 4199 డాలర్లుగా ఉంది.

మరోవైపు వెండి ధరలు కూడా భారీగా తగ్గాయి. శుక్రవాం కేజీ వెండి ధర రూ.2,35,800గా ఉండగా, సోమవారం నాటికి రూ.4,102 తగ్గి రూ.2,31,698కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ స్పాట్ సిల్వర్ ధర 62.13 డాలర్ల వద్ద కొనసాగుతోంది. పారిశ్రామిక డిమాండ్?, పెట్టుబడిదారుల ఆసక్తి, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు మొదలైనవి వెండి ధరలపై ప్రభావం చూపుతున్నాయి.

ఇంట్లో ఎంత బంగారం దాచుకోవచ్చు?

భారతదేశంలో బంగారానికి ఉన్న ప్రాధాన్యత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా మహిళలు ప్రతీ శుభకార్యానికి బంగారం కొనాలని ఆశిస్తుంటారు. పురుషులు కూడా ఈ విషయంలో ఏమాత్రం తక్కువ కాదు. అయితే మన ఇంట్లో గరిష్ఠంగా ఎంత వరకు బంగారం నిల్వ చేసుకోవచ్చు? పసిడి ద్వారా వచ్చే ఆదాయంపై ఎంత పన్ను విధిస్తారు? అనే విషయాలు చాలా మందికి తెలియకపోవచ్చు. అందుకే వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

నిబంధనల ప్రకారం, మన ఇంట్లో ఎంత బంగారం అయినా ఉంచుకోవచ్చు. అయితే పన్ను కట్టకుండా ఇంట్లో ఎంత బంగారం ఉంచుకోవచ్చంటే? సెంట్రల్ బోర్డ్ ఆఫ్? డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) ప్రకారం, పెళ్లైన మహిళలు 500 గ్రాములు, పెళ్లికాని అమ్మాయిలు 250 గ్రాములు వరకు ఇంట్లో ఉంచుకోవచ్చు. అదే పురుషులు విషయానికి వస్తే, పెళ్లి అయినా, కాకపోయినా ఎలాంటి ఆధారాలు చూపించకుండా 100 గ్రాముల వరకు బంగారాన్ని తమ ఇంట్లో నిల్వ చేసుకోవచ్చు. ఇంతకు మించితే ఆ నగలు లేదా బంగారం కొనుగోలు చేయడానికి లేదా వాటిపై పెట్టుబడులు పెట్టడానికి ఆదాయం ఎలా వచ్చింది? అనే విషయాన్ని కచ్చితంగా ఆదాయ పన్ను శాఖ వారికి చూపించాల్సి ఉంటుంది. వాటికి కచ్చితంగా ఇన్?కం ట్యాక్స్ డిపార్ట్?మెంట్ వారికి పన్ను కట్టాల్సి ఉంటుంది.

గోల్డ్ ఇన్వెస్ట్?మెంట్స్?పై ఎంత పన్ను చెల్లించాలి?

'కొంత మంది బంగారాన్ని వ్యక్తిగత అవసరాల కోసం కొంటే, మరికొందరు పెట్టుబడి సాధనంగా వాటిని కొనుగోలు చేస్తారు. ఇలాంటి సమయంలో బంగారు కడ్డీలు, నాణేలు, ఆభరణాలు కొనుగోలు చేసినప్పుడు తయారీ? రుసుములతో సహా జీఎస్టీ చెల్లించాలి. ఇక విదేశాల నుంచి స్వర్ణం దిగుమతి చేసుకుంటే కస్టమ్స్ డ్యూటీ, అగ్రికల్చర్ ఇన్?ఫ్రాస్ట్రక్చర్, డెవలప్?మెంట్ సెస్, జీఎస్టీ రూపంలో మరింత చెల్లించాల్సి ఉంటుంది. ఇన్?కమ్ టాక్స్ రిటర్న్ ఫైల్ చేసేటప్పుడు బంగారం సంబంధించిన సమాచారం చూపించాల్సి వస్తుంది. పన్ను చెల్లింపుదారుల ఆదాయం రూ.50 లక్షలకు మించి ఉంటే, వారు ఐటీఆర్?లో దేశీయ ఆస్తుల్లో (డొమెస్టిక్ అసెట్స్) భాగంగా బంగారం నిల్వల వివరాలు చూపించాలి.

### బంగారం అమ్మితే!

హోల్డింగ్ పీరియడ్?ను అనుసరించి బంగారం (ఫిజికల్ గోల్డ్) అమ్మకాలపై పన్ను విధిస్తారు. బంగారాన్ని కొన్న 3 ఏళ్లలోపే, దానిని విక్రయిస్తే, స్వల్పకాలిక మూలధన లాభాల కింద పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ మూడు ఏళ్ల తరువాత బంగాన్ని విక్రయిస్తే, లాంగ్?-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ కింద ఇండెక్సేషన్? ప్రయోజనంతో 20 శాతం పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఇక డిజిటల్ గోల్డ్?పై వివిధ రకాలుగా పన్ను విధిస్తారు. అయితే స్వల్పకాలిక లాభాలపై ఎలాంటి పన్ను విధించరు. 3 ఏళ్ల తరువాత డిజిటల్ గోల్డ్ విక్రయిస్తే, లాంగ్?-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ కింద ఇండెక్సేషన్? ప్రయోజనంతో 20 శాతం పన్ను విధిస్తారు

# టర్మ్? ఇన్సూరెన్స్?లో "రిటర్న్ ఆఫ్ ప్రీమియం" ప్లాన్? - దీని వల్ల లాభమేంటి?

## కుటుంబానికి ఆర్థిక భరోసాను అందించడంలో టర్మ్ ఇన్సూరెన్స్‌కు ప్రాధాన్యత - అయితే పాలసీ కాలపరిమితి ముగిసే వరకూ జీవించి ఉంటే, ఎలాంటి సొమ్మూ వెనక్కి రాదు!




కుటుంబానికి ఆర్థిక భరోసాను అందించడంలో టర్మ్ ఇన్సూరెన్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. అయితే నార్మల్? టర్మ్? పాలసీలలో ఉన్న ఒక మిస్టేక్? పాలసీ కాలపరిమితి ముగిసే వరకూ జీవించి ఉంటే, ఎలాంటి సొమ్మూ వెనక్కి రాదు. దీంతో చాలా మంది ఈ పాలసీని తీసుకునేందుకు వెనకడుగువేస్తున్నారు. దీన్ని గమనించిన బీమా సంస్థలు రిటర్న్ ఆఫ్ ప్రీమియం పేరుతో ప్రత్యేక ప్లాన్లను అందించడం ప్రారంభించాయి. పాలసీ వ్యాలిడిటీ పూర్తయ్యే వరకూ పాలసీ తీసుకున్న వ్యక్తి జీవించి ఉంటే, చెల్లించిన మొత్తం ప్రీమియాన్ని రిటర్న్? ఇస్తాయి. అలా కాకుండా పాలసీ కాలపరిమితిలో మరణం సంభవిస్తే, నామినీకి బీమా మొత్తం లభిస్తుంది. అయితే చెల్లించిన సొమ్ము తిరిగి వస్తుందనే ఆలోచనతో చాలా మంది ఈ ప్లాన్ల వైపు మొగ్గు చూపుతారని.. కానీ, వీటిలో ఉండే వాస్తవ ఖర్చు, ఇతర అంశాలను పరిశీలించడం చాలా ముఖ్యం అని నిపుణులు సూచిస్తున్నారు. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం. ప్రీమియం భారం: టర్మ్? పాలసీల్లో ప్రధానంగా గమనించాల్సింది ప్రీమియం ధర అని.. ఒకే బీమా మొత్తం, కాల పరిమితి కలిగిన సాధారణ టర్మ్ పాలసీతో పోలిస్తే, వీటి ప్రీమియం రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందంటున్నారు. ప్రీమియం పెరగడం వల్ల చాలామంది తమ కుటుంబ అవసరాలకు సరిపడా రక్షణ కాకుండా తక్కువ బీమా మొత్తాన్ని ఎంచుకుంటారని.. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు ఇవి కుటుంబానికి లభించాల్సిన రక్షణను తగ్గిస్తుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా ఈ పాలసీల్లో లభించే సగటు రాబడి కేవలం 4.5 శాతం నుంచి 5.5 శాతం మధ్య మాత్రమే ఉంటుందని వివరిస్తున్నారు. 20 నుంచి 30 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో ద్రవ్యోల్బణం ప్రభావం వల్ల తిరిగి వచ్చే సొమ్ము కొనుగోలు శక్తి ఇప్పటి విలువతో పోలిస్తే గణనీయంగా తగ్గిపోతుందని వివరిస్తున్నారు.

రద్దు చేసుకుంటే: వ్యక్తిగత కారణాల వల్ల పాలసీని మధ్యలోనే రద్దు చేసుకుంటే నష్టం వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అక్టోబరు 1, 2024 నుంచి అమల్లోకి వచ్చిన రూల్స్? ప్రకారం సంవత్సరం కాలపరిమితి పూర్తయి, పూర్తి ప్రీమియం చెల్లిస్తే, ప్రత్యేక స్వాధీన విలువ లభిస్తుందని చెబుతున్నారు. అంటే గ్యారెంటీ సరెండర్, స్పెషల్ సరెండర్.. ఈ రెండింటిలో విలువ ఎక్కువగా ఉన్న మొత్తాన్ని కంపెనీ చెల్లించాల్సి ఉంటుందంటున్నారు. సాధారణంగా మూడు సంవత్సరాల తర్వాత పాలసీ రద్దు చేసుకుంటే, చెల్లించిన ప్రీమియంలో కేవలం 30 నుంచి 35 శాతమే వెనక్కి వస్తుందని.. 5 సంవత్సరాలకు 50 నుంచి 65 శాతం, 10 ఏళ్లు దాటితేనే 80-90 శాతం వరకూ లభిస్తుందంటున్నారు. ముందస్తు స్వాధీనం వల్ల అసలు ప్రీమియంపై ఎలాంటి రాబడి రాకపోగా, చెల్లించిన సొమ్ములో కొంత కోల్పోవాల్సి వస్తుందని తెలుపుతున్నారు. ఇలా చేస్తే: వయసు తక్కువ ఉన్నవారు, సుదీర్ఘ కాలపరిమితితో బీమా తీసుకునే వారు కట్టిన ప్రీమియం వెనక్కి వచ్చే పాలసీలకు బదులుగా, రెగ్యులర్? టర్మ్ పాలసీని తీసుకోవడమే మేలంటున్నారు. ఆ రెండింటి మధ్య ఉన్న తేడా మొత్తాన్ని దీర్ఘకాలిక పెట్టుబడులకు కేటాయించవచ్చంటున్నారు. 30 నుంచి 40 సంవత్సరాల కాలంలో ఆ మిగులు సొమ్ము మ్యూచువల్ ఫండ్ల చక్రవడ్డీ ప్రభావంతో మంచి నిధిగా మారుతుందని సూచిస్తున్నారు. అయితే పాలసీ తీసుకునే ముందు వివిధ కంపెనీల క్లెయిం సెటిల్?మెంట్? రేషియో, హిస్టరీ, రివ్యూలు, మినహాయింపులు, వేచి ఉండే వ్యవధి వంటి విషయాలు గమనించి నిర్ణయం తీసుకోవడం మంచిదంటున్నారు.

# హైదరాబాద్ వేదికగా 'సమాఖ్య 2026 గ్లోబల్ బిజినెస్ మీట్'




## అక్టోబర్ 13 నుంచి 15 వరకు మహానగరంలో ప్రపంచ స్థాయి సదస్సు- అఫీషియల్? పోస్టర్ ఆవిష్కరణ- హాజరైన ఎంపీ డా. కె.లక్ష్మణ్, మంత్రి ప్రతాప్ రావు, ఎమ్మెల్యే గంటా, హైడ్రా ఛైర్మన్ రంగనాథ్

వ్యాపార, పారిశ్రామిక రంగాలలో కాపు యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్' చేపట్టిన బృహత్తర ప్రయత్నం ఊపందుకుంది. ముంబయిలోని ప్రముఖ 'ఔరికా' హోటల్‌లో బృహస్పతి గ్రూప్ నేతృత్వంలో 'సమాఖ్య 2026 గ్లోబల్ బిజినెస్ మీట్' సన్నాహక సదస్సు అత్యంత వైభవంగా జరిగింది. రానున్న అక్టోబర్ 13 నుంచి 15 వరకు హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ గ్లోబల్ బిజినెస్ మీట్‌కు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, ఎంపీ డా. కె.లక్ష్మణ్, మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ రావు నాయక్, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

### భవిష్యత్ సాంకేతికతలే ధ్యేయంగా ప్రత్యేక చర్చలు

ఈ గ్లోబల్ సదస్సు కేవలం వ్యాపారాలకే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా యువతను సాంకేతిక దిగ్గజాలుగా మార్చడమే లక్ష్యంగా చర్చించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్ వంటి అత్యాధునిక భవిష్యత్ సాంకేతిక రంగాలలో కాపు యువతను భాగస్వామ్యం చేయడంపై ఈ సదస్సు వేదికగా మేథోమధనం చేశారు.

### కాపు యువత పారిశ్రామిక దిగ్గజాలుగా ఎదగాలి- ఎంపీ డా. కె. లక్ష్మణ్

దేశ ఆర్థికాభివృద్ధిలో దేశంలోని అన్ని వర్గాలతో పాటు కాపు సామాజికవర్గం కూడా కీలక పాత్ర పోషించాలని, కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా యువత పారిశ్రామికవేత్తలుగా (ఎంట్రప్రెన్యూర్స్) ఎదగాలని రాజ్యసభ సభ్యులు కె. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పటిష్టమైన కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు. కాపు కులస్తుల సంక్షేమం, వ్యాపార అభివృద్ధే లక్ష్యంగా 'సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్' చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కాపు యువతలో అద్భుతమైన వ్యాపార నైపుణ్యాలు ఉన్నాయని, సరైన వేదిక, సాంకేతిక తోడ్పాటు అందిస్తే వారు గ్లోబల్ మార్కెట్‌లోనూ రాణించగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువతను తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. కేవలం సాంప్రదాయ వ్యాపారాలకే పరిమితం కాకుండా, నేటి తరం యువతను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్ వంటి అత్యున్నత భవిష్యత్ సాంకేతిక రంగాలలో భాగస్వామ్యం చేయడంపై ఈ బిజినెస్ మీట్‌లో ప్రత్యేకంగా చర్చించనుండడం అభినందనీయమన్నారు. ఇది కాపు యువతకు సరికొత్త బంగారు భవిష్యత్తును ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

### మోదీ ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది

దేశంలో పారిశ్రామిక రంగాన్ని, చిన్న, మధ్యతరహా వ్యాపారాలను ప్రోత్సహించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక విప్లవాత్మక పథకాలను, రాయితీలను అందిస్తోందని ఎంపీ లక్ష్మణ్ గుర్తుచేశారు. ముద్ర లోన్లు, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా యువతకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వామ్యం కావాలనుకునే ప్రతి పారిశ్రామికవేత్తకు, వ్యాపార సంస్థకు కేంద్ర ప్రభుత్వ విధానాలు ఎంతో వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని, కాపు పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

### మహారాష్ట్ర అభివృద్ధిలో ఏపీ భాగస్వామ్యం అద్భుతం

ఈ సందర్భంగా మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ రావు నాయక్ మాట్లాడుతూ, ఆ రాష్ట్ర అభివృద్ధిలో ప్రముఖ నిర్మాణ సంస్థ 'మెయిల్' సంస్థతోపాటు ఏపీ అందిస్తున్న సేవలను కొనియాడారు. దేశాభివృద్ధిలో పారిశ్రామిక వేత్తల భాగస్వామ్యం ఎంతగానో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. మహారాష్ట్ర అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్?కు చెందిన వ్యక్తుల భాగస్వామ్యం మరువలేనిదని కొనియాడారు.

### దేశవ్యాప్తంగా సన్నాహక సదస్సులు

హైదరాబాద్‌లో జరగనున్న మహా సదస్సుకు ముందస్తుగా దేశంలోని ప్రధాన నగరాలైన బెంగళూరు, దిల్లీ, చెన్నై, ముంబయిలలో వరుసగా సన్నాహక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కాపు కులస్తులకు కార్పొరేట్ స్థాయిలో వ్యాపార, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సృష్టించడమే ధ్యేయంగా సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ నిరంతరం శ్రమిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815